

వివరాలు మెయిన్‌లో

**సన్న బియ్యం సరఫరా సంక్షేమానికి నాంది**


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 16 ఏప్రిల్, 2025 | పేజీలు : 06


## ఆరుగాలం శ్రమ

# ఆగమాగం...

**రైతుల కళ్ళల్లో దైన్యం!**

**రోడ్లపై పోసిన ధాన్యం నీటిపాలు..**

**పంట కొనుగోలులో అధికారుల నిర్లక్ష్యం...**

**సన్నరకం ధాన్యం అమ్మకాలలో రైతులకు తీరని వ్యధ...**

**ప్రజాపక్షం/ హాలియా:** సన్నరకం ధాన్యం కొనుగోళ్లలో అధికారులు చేసిన జాప్యం రైతుల పాలిట శాపమైంది. గత పది రోజులుగా ధాన్యం కోసి దానిని అమ్ముకునేందుకు రైతులు పడుతున్న పాట్లపై అధికారులు ఎవరు స్పందించకపోవడం చేతికొచ్చిన పంట అకాల వర్షాలకు నేల పాలు కావడం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. నాగార్జునసాగర్ నియోజకవర్గం లోని అనుముల మండలంలో పంట కోత మొదలై 20 రోజులు గడిచినా నేటికీ సన్న రకం దాన్యం అమ్మకాలకు సరైన అడ్రస్ లేకపోవడం రైతులను ముంచింది. అనుముల మండలంలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో కేవలం రెండు మాత్రమే సన్న రకం దాన్యం అమ్మకానికి అనుమతులు ఇచ్చారు. కానీ వాటిలో కూడా ఇప్పటివరకు గింజ ధాన్యం కొనుగోలు చేయలేదంటే అధికారులు తీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసి ముద్ద కాగా, రహదారులపై పోసిన ధాన్యం వాన నీటిలో కొట్టుకుపోవడం రైతుల కంట కన్నీరు చూసింది. ఈ పరిస్థితికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇచ్చి ఉత్సాహపరుస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కారుస్తున్నారు. మంగళవారం సాయంత్రం హాలియా మండలంలో పలు ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. చెక్ పోస్ట్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆరబోసిన ధాన్యం నీటిలో బతుకమ్మల కొట్టుకుపోయి



రైతులకు నష్టాన్ని కలిగించింది. రైతులు నిత్యం అధికారులను కలుస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ వినతులు చేస్తున్నా ఇప్పటివరకు అధికారులు వీటిపై స్పందించిన దాఖలాలు లేవు. ఇదేమని అడిగితే జిల్లా అధికారులు తమకు సూచించిన సూచనల ప్రకారమే తాము ధాన్యం కొనుగోలు చేస్తామంటూ తప్పించుకుంటున్నారు. ఇదే విషయమై ఇటు జిల్లా అధికారులకు రైతుల నుండి విజ్ఞప్తులు పోయినా వారు కూడా సకాలంలో స్పందించకపోవడంతో మంగళవారం కురిసిన భారీ వర్షం రైతుల పాలిట శాపమైంది. సన్న రకం దాన్యం లేని ప్రాంతాలలో అక్కడ ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వెనక మతలభేమిటో అంటు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సన్న రకం భారీగా పండించిన ప్రాంతాలలో దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతీరు అధికారులపై సర్వత్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తక్షణం సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచి తడిసిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



## చరిత్రలో నిలిచిపోయేలా వరంగల్ సభ

**పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి**

**ప్రజాపక్షం/వలిగొండ :** బిఆర్ఎస్ 25వ వసంతంలో అడుగుపెడుతున్న తరుణంలో ఈనెల 27న వరంగల్‌లో తలపెట్టిన రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో మత్స్యగిరిగుట్ట నుండి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి పాదాల వరకు తలపెట్టిన పాదయాత్రను మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్ సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని సబ్బండ వర్గాలు కదిలి వస్తున్నాయని అన్నారు. ఇవ్వాళ అందరిలో చైత్యనాన్ని స్ఫూర్తిని నింపేల బిఆర్ఎస్వి విద్యార్థులు పాదయాత్ర చేపట్టారు,వరంగల్ సభ తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందనీ వ్యాఖ్యానించారు. ఇవ్వాళ ప్రజలకు కష్టం వస్తే మా కేసీఆర్ ఉంటే బాగుండు అని అంటున్నారనీ కేసీఆర్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, గాదిరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, భూడిద బిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మరియు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచాలి : అల్లె రమేష్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పేదల ప్రభుత్వమని నిత్యం చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మాటలలో కాకుండా చేతలలో కూడా చూపిస్తూ ప్రభుత్వ భూమిని ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పజెప్పకుండా పేదలకు పంచాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మండలంలోని గోప్లాయి పల్లి గ్రామరెవెన్యూ పరిధిలో ఉన్న 100 ఎకరాల భూమిలో 90 ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణి చేసి పట్టాలను ఇవ్వగా మిగిలిన 10 ఎకరాల భూమిని కూడ పేదలకు పంపిణి చేయకుండా ప్రవేటు రంగ సంస్థవారికి అప్పజెప్పడం సరి కాదన్నారు. ఇదే తరహాలో గోప్లాయిపల్లి గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 550 లో మూడు ఎకరాల భూమిని టిజిఐఐసి కి కేటాయించిగా పరిధిని మించి అక్రమ కట్టడాలు చేపట్టిందని, వాటిని వెంటనే నిలిపి వేసి ప్రైవేటు కంపెనికి కెటాయించిన భూమిని కూడా పేదలకు పంపిణి చేయాలంటూ కోరుతూ మంగళవారం పరమేశ్ తహశీల్దార్ వెంకటేశర్లు కు వినతి పత్రం అందజేశారు.



# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని గంగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపివో జ్యోత్స్న మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీలలో ప్రభుత్వం అందిస్తున్న పౌషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గర్భిణిలు, బాలింతలు సరైన పోషకాహారాన్ని తీసుకోవడం వలన పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఎటువంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు దోహద పడుతుందని తెలిపారు. ఆకు కూరలు, పాలు, గుడ్లు, ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని అధిక మొత్తంలో తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. అనంతరం పిల్లలకు అన్నప్రసాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ శమీమ్, బ్లాక్ కో ఆర్డినేటర్ ఆశం, అంగన్‌వాడీ టీచర్ యాదలక్ష్మి, గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పౌష్టికాహారంతోనే అందరు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ అన్నారు. మంగళవారం మండలంలోని టీక్యా తండాలో సీడీపీవో మమత ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణపక్షం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడిలో అందించే పోషకాహారాన్ని తీసుకోని ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని గర్భిణీలు నార్మల్ డెలివరి అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అతి తీవ్ర లోప పోషణ ఉన్న పిలల్ని గుర్తించి వారి పోషణ స్థాయి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, ఏపీవో కళావతి, అంగన్‌వాడి టీచర్ కమల, కవిత, ఝాన్సీ, ఆశా వర్కర్లు లక్ష్మి, సునీత, పంచాయతీ కార్యదర్శి తాహెరా సుల్తానా పాల్గొన్నారు.



## ఆదిత్య విద్యార్థి ప్రతిభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన సెకండ్ రౌండ్‌లో ఆదిత్య పాఠశాల విద్యార్థిని వి.జేత్ర మాథ్స్ ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయిలోత 6వ ర్యాంకు సాధించి రూ.1000 స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా సైన్స్ ఒలంపియాడ్‌లో వెంకట్‌సాయి, జశ్వన్‌తేజ్‌లు ఎక్స్‌లెన్స్ అవార్డును సాధించగా ఆయా విభాగాల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో రాణించాలంటే ప్రాథమిక స్థాయి నుంచి పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్యకు 25శాతం సీట్లు కేటాయించేలా ఈ విద్యా సంవత్సరం నుంచే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాలనే నిబంధనలు ఉన్నా కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలు వాటిని అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల రెగ్యులేషన్ కమిటీ ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని అన్నారు. ఫీజులు కూడా అడ్డగోలుగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేట్ విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఫీజుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు.

## పదవీవిరమణ పొందిన హోంగార్డ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** జిల్లా పోలీస్ శాఖలో ఫింగర్ ప్రింట్ విభాగంలో హోమ్ గార్డ్ గా పనిచేస్తున్న యం.డి సలీం పదవి విరమణ పొందుతున్న సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఘనంగా సత్కరించి వారు పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ శాఖ లో హోమ్ గార్డ్ గా 34 సంవత్సరాల పాటు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాస్,హోమ్ గార్డ్ ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య చిత్రాన్ని నిర్మించడం అభినందనీయం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: తెలంగాణ సాయుధ పోరాట ఇతివృత్తంతో ప్రతి ఒక్కరి నుండి రూ. 15లు వసూళ్లు చేసి చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉంద్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ వూర రాంమూర్తి యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా సంఘాల నాయకులు ప్రతి ఒక్కరి నుండి రూ. 15వసూళ్లు చేసి దొడ్డి కొమురయ్య జీవితంపై చిత్రాన్ని నిర్మించే భాగంలో మంగళవారం చిత్ర యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 60ఫీట్ల రోడ్డులోని కామ్రేడ్ బీంరెడ్డి నర్సింహ్మారెడ్డి విగ్రహం వద్ద చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధులను గుర్తు చేస్తూ చిత్రాన్ని నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట రథసారధి బీమిరెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ పోరాటాలను వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సినీమా డైరెక్టర్ సేనాపతి, ప్రజా సంఘాల నాయకులు మల్లు నాగార్జున్ రెడ్డి, కొత్తపల్లి శివకుమార్, ముల్కలపల్లి రాములు, తప్పెట్ల శ్రీరాములు, చల్లమల్ల నర్సింహ, నారాయణ పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం ప్రతి ఒక్కరూ సద్వినియోగం



**ప్రజాపక్షం/మునగాల:** సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు పగిడిపల్లి ఏసుపాదం తెలిపారు. మంగళవారం కోదాడ పట్టణంలోని అర్అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యారమాద కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సామాన్యుడికి, అధికారులకు వారధిగా సమాచార హక్కు చట్టం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, ఉపాధ్యక్షులు షేక్ అహ్మద్, కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎండి మజహర్, సభ్యులు చందోలు జగదీష్, శ్రీరంగం లక్ష్మ ణ్, ఎండి ముబీబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని వినతి



**ప్రజాపక్షం/చివ్వెంల:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరుతూ మంగళవారం గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఓ సంతోష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రం మాట్లాడుతూ చేసేందుకు పనులు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 150రోజులు పని దినాలు కల్పించాలన్నారు. గ్రామమంలో ఒక వారంలో ఒక గ్రూప్‌కు మరో వారం మరో గ్రూప్‌కు పనులు చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ప్రతి కూలీకి రూ. 350ల వేతనం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డబ్బులను చెల్లించాలన్నారు. ఉదయం 10గంటల వరకు పని చేయించాలని, వడదెబ్బకు గురైన కూలీలకు ప్రభుత్వమే చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాషపంగు సునీల్, అనంతుల ఎల్లయ్య, వెంకన్న, బాబు, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

## కమ్మవారు సామాజికంగా ముందు ఉండాలి



**ప్రజాపక్షం/ హాలియా:** కమ్మవారు సామాజికంగా ముందు ఉంటూ సంకటితంగా పనిచేయాలని మాజీ జెడ్పీ చైర్మన్ సిడి రవికుమార్, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పా అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం హాలియా లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో కమ్మ సంఘం హాలియా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొని వారు మాట్లాడారు. మనవారు కష్టపడే తత్వం కలిగి భూమిని నమ్ముకొని వినూత్న పంటలు సాగు చేయటంతో పాటు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, పేర్కొన్నారు. సంఘంలోని పేదవారిని ఆదుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని ఒకరికొకరు పరస్పరం చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు. అనంతరం అనుముల మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావిళ్ళ చెన్నయ్య, కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా నారాయణరావు, పట్టణ అధ్యక్షులుగా కోటా శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోటపాటి మధుబాబు, ఇతర కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి పేలపూడి బాలకృష్ణ సభాధ్యక్షుడి గా వ్యవహరించగా ఈకార్యక్రమంలో చేకూరి హనుమంతరావు, బండార్ ప్రసాద్, కోడే సతీష్ కుమార్, గోడపర్తి జానకిరామయ్య, పేలపోలు తిరుపతమ్మ, వెంకటరమణ చౌదరి, సాధినేని శ్రీనివాసరావు, చెరుకూరు సుబ్రహ్మణ్యం, మద్దుకూరి రాంబాబు,మేడిపల్లి మోహన్ రావు, ఉన్నంచిన వీరయ్య, రామకృష్ణ, రామ అవతారం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో నాణ్యమైన వసతులు

**ప్రజాపక్షం/కోదాడ :** ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విశాలమైన మైదానం, తరగతి గదులు, స్వచ్ఛమైన తాగునీరు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో భోదన జరగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్కేండేయ, హరిజనవాడ ప్రధానోపాధ్యాయులు చిగురుపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎల్.దేవరాజు, ఎస్‌కె ఖాజా మియా, రామకృష్ణ, బడుగుల సైదులు, శ్రీలత, సైదిరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణకు పర్యవేక్షించాలి



**ప్రజాపక్షం/మునగాల:** నర్సరీ మొక్కల సంరక్షణను అధికారులు తప్పకుండా పర్యవేక్షించాలని మండల ప్రత్యేక అధికారి, జడ్పి సిఇవో శీరిష అన్నారు. మంగళవారం మండలంలోని రేపాల గ్రామంలో హరితహర మొక్కలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ బ్యాగులలో విత్తనాలు పెట్టాలని అదేశించారు. మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని, మండల స్థాయి అధికారులు నర్సరీలను సందర్శించాలని సూచించారు. అనంతరం నర్సింహులగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించి, కూలీల హాజరు నమోదు, మస్టర్‌ను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో మంచినీటి సదుపాయం కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఎపీవో శైలజ, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణి, సావిత్రి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అందాల పోటీలను రద్దు చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** రాష్ట్రంలో మే 7న జరిగే ప్రపంచ అందాల పోటీలను పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పివైఎల్ జిల్లా అధ్యక్షులు నాగయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పిఓడబ్ల్యూ, పివైఎల్, పిడిఎస్‌యు జిల్లా కమిటీల ఆధ్వర్యంలో అందాల పోటీలను రద్దు చేయాలని కోరుతూ పివైఎల్ రాష్ట్ర నాయకులు బండి రవి, పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగమ్మల అధ్యక్షతన జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో వారు మాట్లాడారు. 2024లోనే ప్రపంచ అందాల పోటీలు ముంబాయిలో జరిగాయని తిరిగి 2025లో దుబాయిలో నిర్వహించాల్సిన అందాల పోటీలను వారితో పోటీ పడి ప్రభుత్వం ఇక్కడ నిర్వహించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు సుజాత, జయసుధా, ఉపేంద్ర, దీనక్క, వీరబోయిన రమేష్, దండు ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

## నాగరాజుకు పరామర్శ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రెండు రోజుల క్రితం మిర్యాలగూడలోని రైస్ మిల్లు యజమానులు రైతు శివనేని నాగరాజుపై దాడి చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును మంగళవారం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, గాజుల పున్నమ్మ, పెరుమాళ్ల ధనమ్మ, సైదులు తదితరులు ఉన్నారు.

# పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం

### లబ్ధిదారుని ఇంట్లో సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సంపన్నులతో సమానంగా సన్న బియ్యాన్ని అందజేస్తోందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. మంగళవారం కేటిదొడ్డి మండలం మల్లాపురం గ్రామంలో లబ్ధిదారుడు సురేష్ నాయక్ కుటుంబ సభ్యులతో గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ స్వయంగా సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత గల ప్రతి పేదవాడికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. గద్వాల్ శాసన సభ్యు లు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. సన్నబియ్యం లబ్ధిదారులు మాట్లాడుతూ, తమ ఇంటికి కలెక్టర్, అధికారులు భోజనానికి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సన్న బియ్యం పథకం ద్వారా రుచికరమైన భోజనం చేస్తున్నాయని అధిక డబ్బులు వెచ్చింది బియ్యాన్ని బయట కొనుగోలు చేమకుండా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని లబ్ధిదారుడు తెలిపారు. అనంతరం కలెక్టర్, శాసనసభ్యులు గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలిసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, గద్వాల్ మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు తహసీల్దార్ హరికృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు మండల ముఖ్య నాయకుల సమావేశం

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం నేడు దేవరకొండలోని విష్ణు ఫంక్షన్ హాల్‌లో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జర్పుల లోక్యనాయక్ మంగళవారం తెలిపారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మండలం నుండి భారీ సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు. నేడు జరిగే మండల ముఖ్య నాయకుల సమావేశానికి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్, జిల్లా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు.

## గంధమళ్ళలో కాంగ్రెస్ సంవిధాన్ కార్యక్రమం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కాంగ్రెస్ తుర్కపల్లి మండల అధ్యక్షులు ధనవత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో గందమళ్ల, ఇంద్రనగర్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ప్రతి గల్లీ ప్రతి వాడలో గాంధీ, అంబెడ్కర్ చిత్రపటాలు, రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని ప్రజలందరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎలుగల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మోహన్ బాబు, మార్కెట్ కమిటీ పట్టు నాయక్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబెర్ డోంకేనా వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు భూక్య రాజారామ్ నాయక్, బొత్త రాములు, బిసి సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, బీసీ సెల్ చైర్మన్ రామగోని వెంకటేష్, గ్రామ శాఖ ఎల్లేష్, కనకయ్య, సాప కిష్టయ్య, ధనజయ్య, శ్రీశైలం, తిరుపతి, బాలరాజ్, మోత్కుపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## జల్లాపురంలో పాతబడ్డ చెక్‌డ్యామ్ సమస్యపై స్పందించిన ప్రభుత్వ అధికారులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో వ్యవసాయ బోరు బావులు, వీధి వాడలో చేతి హ్యాండ్ పంపులో జల ఉత్పత్తిని పెంచేందుకు అలాగే వ్యవసాయ రైతు పశు పోషణ ఎద్దులు పాడి గేదెలకు గొర్రెలకు మేకలకు ఇలాంటి మూగ జీవాలకు తాగడానికి నీటిని నిల్వ చేసే విధంగా 20 సంవత్సరాల కిందట చెక్‌డ్యామ్ ను మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కూలీలచే విశాలమైన పొడవు వెడల్పుతో నిర్మించడం జరిగింది. కాలక్రమేణ పరంగా అధిక వర్షాలు కురవడంతో ఈ చెక్ డ్యామ్ లోపల భాగంగా పూర్తిగా బురద ఒండు మట్టితో చెక్‌డ్యామ్‌ను ముంచేయడంతో వివిధ రకాల ముండ్ల కంప చెట్లు జమ్ము లబ్బర్ తీగల చెట్లు పెద్ద ఎత్తున ఏపుగా పెరగడంతో చెక్ డ్యామ్ ఒక సైడ్ కోతకు గురి కావడంతో ఈ ఎండ కాలంలో మూగ జీవాలకు వ్యవసాయ బోరు పంపులకు వీధి వాడలో చేతి హ్యాండ్ పంపులకు నీటి జల ఉత్పత్తి తగ్గడంతో నీటి నిల్వ సౌకర్యము లేక పశుపోషణ రైతులు గ్రామ ప్రజలు నీటి ఎద్దడికి నానా తిప్పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డి సామాజిక కార్యకర్తలు శాంతకుమార్ నజీర్ భాష ఈ నెల 13వ తేదీన జల్లాపురం గ్రామంలో పాతబడ్డ చెక్ డ్యామ్ సమస్యను వీడియో , న్యూ దినపత్రికల ద్వారా జిల్లా కలెక్టర్ కి జిల్లా డీపీఓ కి, మండల ఎంపీడీవో కి గ్రామ పంచాయతీ కార్యదర్శి కి తెలుపడం జరిగింది. ఈ సమస్య పై జిల్లా కలెక్టర్ స్పందించడం తో మంగళవారం పాతబడ్డ చెక్ డ్యామ్ ను మండల ఎంపీడీవో భాస్కర్ సామాజిక కార్యకర్త శాంతకుమార్ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి గ్రామ ఫీల్ట్ అసిస్టెంట్ ఖజ్జూర్ భాష సందర్శించడం జరిగింది. సందర్శించిన అనంతరం ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ ఈ చెక్ డ్యామ్ పనులకు సంబంధించి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి పథకంలో వెంకటనే ఎస్టిమేషన్ వేయించి త్వరలో పనులు చేపడతామని చెప్పడం జరిగింది.

## నేడు బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** నేడు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షతన తుర్కపల్లి మండల విస్తృతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత, డిసిసిబి చైర్మన్ గొంగడి మహేందర్ రెడ్డి, ఆలేరు మాజీ శాసన సభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, సుధగాని హరిశంకర్ గౌడ్ పాల్గొంటున్నారని మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, పోగుల ఆంజనేయులు, కల్లూరి ప్రభాకర్ రెడ్డి, హరి నాయక్, దత్తాయపల్లి మాజీఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, వెంకట్ రెడ్డి, సురేందర్, భూక్యా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





## ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో యూనియన్ బ్యాంక్ ముందు ప్రతి రోజు ట్రాఫిక్ తీవ్రంగా ఏర్పడడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ సూచికలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహన దారులు తమ వాహనాలను పార్కింగ్ స్థలాలలో ఉంచాలని అన్నారు.

## బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** నాంపల్లి గ్రామము నుండి సోమవారం రాత్రి యాచారం వెంకటేష్,28, పనులు ముగించుకొని తన సొంత ఊరు మర్రిగూడకు పనులు ముగించుకొని బైకుపై వస్తుండగా అదుపుతప్పి క్రిందపడి చనిపోయాడా, లేదా ఏదైనా వాహనము తగిలించారా అని సందేహం వ్యక్తం అవుతుందని కు టుంబ సభ్యులు బంధువులు అనుమానిస్తున్నారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె, ఉన్నారు, ప్రభుత్వం చనిపోయిన నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

## జై జవాన్ .. జై కిసాన్



**ప్రజాపక్షం/ హాలియా:** దేశ సరిహద్దుల్లో తమ ప్రాణాలను ఒడ్డుతు ప్రజలకు రక్షణ కల్పిస్తున్న జవాన్... ఆపదలో ఉన్న రైతులకు అండగా ఉంటామని వర్షానికి తడుస్తున్న ధాన్యాన్ని మ రింత తడవకుండా తన వంతు రైతులతో చేయి కలిపి శభాష్ అనిపించుకున్నారు. మంగళవారం సాయంత్రం భారీగా కురిసిన వర్షానికి చెక్ పోస్ట్ ఫ్లైఓవర్ పై ఆరబోసిన ధాన్యం తడవడంతో రైతులు వాటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న జవాన్ల వాహనం రైతులు పడుతున్న కష్టాలను చూసి అక్కడే వాహనం ఆపి పదిమంది జవాన్లు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తున్న ధాన్యాన్ని కాపాడేందుకు కిందికి వచ్చి రైతులతో కలిసి ధాన్యాన్ని దగ్గర చేశారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో జవాన్లు ధాన్యం తడవకుండా చేసిన ప్ర యత్నం రైతుల మనుసును దోచుకుంది. జై జవాన్... జై కిసాన్ అంటూ రైతులు జవాన్లు చేసిన సహాయానికి చేతులెత్తి నమస్కరించారు.

## పిల్లల రక్షణ,సంరక్షణపై అవగాహన



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ తూటి మహిపాల్ ఎన్ఆర్ఈజీఎస్ సభ్యులకు చైల్ హెల్ప్ లైన్ 1098 గురించి అవగహన కలిగించారు. పిల్లలకు రక్షణ సంరక్షణ అవసరమైన బాల్యవివాహాలు, వీధి బాలలు, అక్రమ దత్తత జరిగిన, ఆశ్రయం లేని పిల్లలకు ఆశ్రయం కల్పించాలన్న, చైల్ హెల్ప్ లైన్‌కి ఫోన్ చేయాలనీ తెలిపారు. పిల్లలకు ఉన్నత చదువులు అందించాలని, విద్య తోటే వారు ఉజ్వల భవిష్యత్తు పొందుతారని తెలిపారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి ఫోన్ చేసిన వారి సమాచారం గొప్యంగా ఉంచుతామనీ తెలిపారు.

# నీటి ఎద్దడి లేకుండా చర్యలు



**-నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు**
**-కమిషనర్ అభిషేక్ అగస్త్య**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. నీటి సరఫరాపై మంగళవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ విభాగ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖమ్మం నగరంలో త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు చర్యలు, జలాశయాల నీటిమట్టం, పంపింగ్ స్టేషన్ల పనితీరు, లీకేజీ నివారణ తదితర అంశాలపై చర్చించారు. అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి వృథాను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు రేషన్ చేసిన విధంగా నీటి సరఫరాను చేపట్టాలన్నారు. అత్యవసర సమయంలో ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పాలేరు రిజర్వాయర్‌లో 90 రోజులకు సరిపడ నీటి నిల్వలు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం నగరంలో ఉపయోగించుకోవడం కోసం 548 హ్యాండ్ బోర్స్, 76 పవర్ బోర్స్, 14 ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని డివిజన్లకు నీటి సరఫరా అందేలా కార్యాచరణ చేపట్టి నీటి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల్లో నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. అనంతరం ఆర్వో, వార్డు ఆఫీసర్లతో ఇందిరమ్మ ఇండ్ల ఎల్1 వెరిఫికేషన్ స్టేటస్ గురించి కమిషనర్ చర్చించారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**-ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు ధన్యవాదాలు**
**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలనేదే ప్రభుత్వ సంకల్పమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వమని నిరూపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రి మండలి సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన ఎస్సి వర్గీకరణ, ధరణి సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం చెవేళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ జయంతి రోజున జీవో విడుదల చేసిందన్నారు. మాదిగ ఉపకులాలకు, రైతులకు న్యాయం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి సాగుతున్న పాలన రిజర్వేషన్ అమలు వరకు వచ్చిందన్నారు. ఆర్థికపరంగా సమస్యలు ఉన్న వాటిని అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ ప్రజల మన్ననలు ప్రభుత్వం పొందుతుందన్నారు. ఎస్సి వర్గీకరణ ద్వారా మూడు దశాబ్దాల పోరాట ఆకాంక్షలను నెరవేర్చి విద్య, ఉద్యోగ, స్థానిక రాజకీయాల్లో బడుగు,బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టరూపం ఇవ్వడం జరిగిందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సంకల్పిస్తుందన్నారు. పేద వారి ఆకలిని తీర్చేందుకు సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ధరణి లోపాలను సవరిస్తూ భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సేవా దళ్ కో ఆర్డినేటర్ చోటాబాబా, టిపిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్,మొక్కా శేఖర్ గౌడ్, గజ్జెల్లి వెంకన్న, రషీద్, ముక్రం, యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు సైదులు నాయక్, రాపర్తి శరత్, కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, చామకూరి వెంకటనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ధంసలాపురం సిపిఐ శాఖ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ ధంసలాపురం సిపిఐ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ధంసలాపురంలోని బిసి కాలనీలో సిపిఐ శాఖ మహాసభ యాతం భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంతాభివృద్ధికి సిపిఐ ఎనలేని కృషి చేసిందన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు ఇండ్లు ఇప్పించిన ఘనత సిపిఐదేనన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పడిన కమిటీ పార్టీ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. 16వ డివిజన్ కార్యదర్శిగా యాతం భూపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వెంపటి నాగేశ్వర రావు, ఖాదర్‌బాబాతో పాటు 11 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య, 22వ డివిజన్ కార్యదర్శి కట్ల నర్సింహారావు, వన్‌టౌన్ ఏరియా మహిళా సమాఖ్య అధ్యక్షులు నారపోగు నాగమణి, సీనియర్ నాయకులు రోశయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు మంగళవారం ఆయన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో సైలో బంకర్ నుండి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యల వివరించి వారికి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా డి.ఎం.ఎఫ్.టి నిధులు గురించి సీఎంతో చర్చించారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతానన్నట్లు ఎం.ఎల్.ఏ తెలిపారు.

# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అం దించి ఆదుకోవాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంట నష్టపోయి వారంరోజులు గడుస్తున్నా ఏ ఒక్క వ్యవసాయ అధికారి కనీసం నష్టం నమోదు చేసేందుకు కూడా లేదన్నారు. వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా రేమిడిచర్ల గ్రామంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోడీ నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్లమెంటరీ అభ్యర్థి తాండ్ర వినోధర్‌రావు, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, జిల్లా మోర్చా అధ్యక్షులు కిరణ్, మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు నూతక్కి నర్సింహారావు, బిజెపి జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకాంత్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు


**ప్రజాపక్షం/ ఖమ్మం:** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ మృతి ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని లోటని జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య అన్నారు. మండల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎర్ర శ్రీకాంత్ సంతాప సభను మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎర్ర శ్రీకాంత్ మృతి చెందటం చాలా బాధాకరమని, ఆయన జీవితం పార్టీకి అంకితం చేసి చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడనే ఉన్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గామాసు జోగయ్య, దూదిగం బసవయ్య, షేక్.నాగుల్‌మీరా, సుబ్బారెడ్డి, మహేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మంగళవారం కొత్త గూడెం సింగరేణి సెక్యూరిటీ జనరల్ మేనేజర్ చందా లక్ష్మి నారాయణ ఆదేశాలతో లక్ష్మి దేవి పల్లి మండలంలోని లోతు వాగు ప్రాంతంలోని స్క్రాప్ దుకాణాలలో సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అనంతరం దుకాణా దారుల తో సెక్యూరిటీ అధికారులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ కు చెందిన ఇనుప సామానులు ఎవరి వద్ద నుండీ కొనుగోలు చేసిన చట్టం ప్రకారం శిక్ష కు గురి అవు తారని దుకాణా దారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి, బాస్కరరావు రెడ్డి, శివ కుమార్, ఉదయ బాస్కరరావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# సెక్యూరిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/కొత్త గూడెం టౌన్** చందా లక్ష్మినారాయణ, జనరల్ మేనేజర్ అధ్యక్షతన అన్నీ ఏరియాల సెక్యూరిటీ అధికారులతో యస్ పిసి పరిపాలన పరమైన అంశాలు, దొంగతనాల నివారణ, ఎండాకాలంలో సెక్యూరిటీ సిబ్బందికి కావలసిన సదుపాయాలు, ఏరియాలలో స్క్రాప్ తీసివేత, మ్యాన్ పవర్, కోల్డ్ ట్రాన్స్పోర్ట్ ట్రక్స్ మూమెంట్, ఖాళీ స్థలాలు ఎస్టేట్ వారి అనుబంధంతో గుర్తించి వాటిని సివిల్ డిపార్ట్మెంట్ సహాయంతో ఫెన్సింగ్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయించి లా అండ్ ఆర్డరు సమస్యలు ఎదురైతే పోలీసు వారి సహాయముతో పరిష్కరించుకొని కంపెనీ కాలీ స్థలాలను సెక్యూరిటీ సహాయంతో కాపాడుకోవాలని తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమములో జె.వేణుమాధవ్, ఎస్వోటూ జియం సెక్యూరిటీ, కార్పోరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారి, అన్ని ఏరియాల సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

# కొర్రమీను చేపల పెంపకంతో రూ. లక్షల్లో లాభాలు

## అవగాహన సదస్సులో కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిరులు పండించే కొర్రమీను చేపల పెంపకం ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులకు, వ్యవసాయ శాఖ ఏపీఎంలకు కొర్రమీను చేపల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయం అన్ని సమయాల్లో కలిసి వస్తుందని గ్యారంటీ లేదని, ఎందుకంటే వర్షాలు ఎక్కువగా పడిన ఇబ్బందే..తక్కువగా పడినా కూడా ఇబ్బందే అని అన్నారు. ప్రకృతి సహకరిస్తేనే అధిక దిగుబడిని పొందగలరు అని అన్నారు. కానీ అకాల వర్షాల కారణంగా పంట చేతికి అందకుండా పోతుందని, దీంతో పాటు ఇంట్లో ఉన్న మహిళలు మగవాళ్లు అందరూ, వ్యవసాయ కూలీలు నిరంతరం ఆదాయం వచ్చే చేపల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ చేపల పెంపకంలో కొర్రమీను మాత్రమే ఎందుకు చెప్తున్నామంటే అది ఎటువంటి వాతావరణం అయినా తక్కుకుని బురదలో అయినా బతికే చేప కాబట్టి అని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం కొరకు ప్రదేశం కూడా అవసరం లేదని ఒక పావుగుంట ప్రదేశంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకో పావు కుంట ప్రదేశంలో ఫామ్ ఫౌండ్ నిర్మాణం, సుమారు మూడు లక్షల యాభై వేల రూపాయలతో చేపల పెంపకానికి అవసరమైన అన్ని వాటర్ ట్యాంక్, దానా వంటివి తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్కో చేప పిల్ల ఖరీదు 15 రూపాయలు కాగా 1000 చేపల పిల్లల పెంపకం చేపట్టి అందులో 100 చేప పిల్లలు చనిపోయిన 900 చేప పిల్లలు మీ చేతికి వస్తే కిలో సుమారు 300 రూపాయలకు అమ్మిన 2,70,000 రూపాయలు కేవలం 7 నెలల్లో చేతికి వస్తుందని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం యూనిట్ స్థాపన కొరకు బ్యాంకుల ద్వారా పీఎం ఈజిపి పథకం ద్వారా 35శాతం సబ్సిడీ వస్తుందని, చేపల పెంపకానికి కావలసిన ఫామ్ పౌండ్ నిర్మాణం ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మించవచ్చని తెలిపారు. ఈ కొర్ర మీను చేపల పెంపకం ద్వారా కేవలం రెండు సంవత్సరాలలోనే పెట్టుబడి వాపసు వస్తుందిన, లక్షల్లో ఆదాయం చేకూరుతుందని, మరి ఇతర పంటల్లోనూ ఇంత ఆదాయం రాదని అందువలన జిల్లాలోని రైతులు మహిళా సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో కొర్రమీను చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. కొర్ర మీను చేపల పెంపకంలో నాణ్యమైన దానా వాడాలని, రోజుకు ఐదు సార్లు చేపలకి దాన వేయాలని సూచించారు. ఈ దాన అనేది ఆటోమెటిక్‌గా సరఫరా అయ్యే విధంగా ప్రయోగాలను శాస్త్రవేత్తలతో కలిసి నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆక్వా కనెక్ట్స్ సమస్త వారు కొర్రమీను చేపల పెంపకం, మార్కెటింగ్, చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు, మహిళలకు పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన, సందేహాల నివృత్తి చేపట్టారు. అనంతరం జిల్లాలో ప్రయోగాత్మకంగా అశ్వాపురం, సుజాతనగర్ లో స్థాపించి కొర్రమీను చేపల పెంపకంలో విజయం సాధించిన రైతులు దుర్గాప్రసాద్, జంపన్న వారు చేపడుతున్న చేపల పెంపకంలో వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ తిరుపతయ్య, మత్స్యశాఖ ఏడి ఇంతియాజ్ ఖాన్, ఆక్వాకనెట్స్ సంస్థ ప్రతినిధులు, మహిళా సమైక్య సభ్యులు, ఏపిఎంలు, సుమారు 400 మంది పాల్గొన్నారు.

# భూ భారతి సంబురాలు..!

## -పైలట్ ప్రాజెక్టుగా నేలకొండపల్లి మండలం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి లో నేలకొండపల్లి మండలం ను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేయటంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. తొలుత స్థానిక తహశీల్ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణా సంచాలు కాలుస్తూ, నినాదాలు చేస్తూ సంబురాలు చేశారు. సీఎం రేవంత్రెడ్డి తో పాటు మంత్రులు చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడ్దారు. భూ భారతి చట్టం తో రైతుల సమస్యలు తీరుతాయని పేర్కొన్నారు. ధరణితో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ గా నేలకొండపల్లి మండలం ను ఎంపిక చేసినందుకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి కికృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, కాంగ్రెస్ నాయకులు వజ్జా రమ్య, జెర్రిపోతుల అంజిని, శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, భద్రయ్య, వెంకన్న, మైశా శంకర్, బచ్చలకూరి నాగరాజు, బొందయ్య, బోయిన వేణు, రావెళ్ల కృష్ణారావు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, యడవల్లి నాగరాజు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, ముండ్రా నాగప్రసాద్, గోపి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు మందలించారని ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తల్లిదండ్రులు మందలించారని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ యశ్వంత్ (18) అనే ఇంటర్ సెకండ్ హియర్ చదువు పూర్తి చేసిన విద్యార్థి ఇటీవల జరిగిన ఇంటర్ మీడియట్ పరీక్షలు వ్రాశాడు. పరీక్షలు అయినప్పటీ నుంచి తల్లిదండ్రుల మాట వినకుండా ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతూ, తల్లిదండ్రలను దిక్కిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంచి మార్గంలో పయనించాలని వారు మందలించటంతో మంగళవారం నేలకొండపల్లి లోని బౌద్ధక్షేత్రం సమీపంలో ఓ వెంచర్ లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వటంతో పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని పంచనామానిర్వహించారు. తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం ను స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో పోస్టుమార్టమ్ నిర్వహించారు. మృతదేహం పై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పడి రోధిస్తున్న తీరు అందరిని కంట తడిపెట్టించింది.

# వనజను సన్మానించిన గ్రామస్తులు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వైద్య విద్యను పూర్తి చేసి తొలిసారి గ్రామానికి వచ్చిన మార్కపూడి వనజను చింతగుర్తి గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన మార్కపూడి వెంకటేశ్వర్లు నిర్మల దంపతుల కుమార్తె మార్కపూడి వనజ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబిబిఎస్ పూర్తి చేసి పట్టా అందుకుంది. గ్రామంలో వైద్య విద్యను పూర్తి చేసిన మొదటి వ్యక్తి వనజ కావడం గమనార్హం. వైద్య విద్యను పూర్తి చేసి మొదటిసారి గ్రామానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ఏఎంసి డైరెక్టర్ తమ్మిని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం వనజను సన్మానించారు. వనజను శాలువతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. వనజ తండ్రి వెంకటేశ్వర్లు గ్రామంలో ఆర్ఎంపిగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

# సమ్మక్క సాగర్ బ్యారేజ్ నుండి నీరు విడుదల



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** జిల్లాలో త్రాగు నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా సమ్మక్క సాగర్ బ్యారేజ్ నుండి నీరు విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రానున్న రోజుల్లో జిల్లా వాసులకు త్రాగునీటికి ఇబ్బంది రాకుండా ఉండేందుకు నిరంతర పర్యవేక్షణతో మిషన్ భగీరథ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో మంగళవారం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజ్ నుండి అధికారులు 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందని, ఏప్రిల్, మే నెలలో త్రాగు నీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా నీటిని విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పలువురు వ్యక్తులకు జరిమానా విధిస్తూ కొత్తగూడెం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు మంగళవారం తీర్పు చెప్పారు. కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ టౌన్ ఎస్ఐ డి రాఘవయ్య వాహన తనిఖీ చేయుచుండగా ఇద్దరు వ్యక్తులు అతిగా మద్యం తాగి తమ తమ వాహనం నడుపుచుండగా వారిని ఆపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా అతిగా మద్యం త్రాగినట్లు రికార్డు కాగా వారిని కోర్టులో ప్రవేశపెట్టగా రెండు కేసులలో జరిమానా చెల్లించారు. లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ జి రమణారెడ్డి వాహన తనిఖీ చేయుచుండగా నలుగురు వ్యక్తులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం త్రాగినట్టు రుజువు కాగా కోర్టులో ప్రవేశపెట్టగా నలుగురికి జరిమానా విధించారు.

# ఎస్‌బిఐ ప్రమాద బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత సంవత్సరం పెద్దరాయిగూడెం గ్రామానికి చెంది న నడిపింటి సరిత 03అక్టోబర్2024న సారపాక బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బస్ ప్రమాదంలో మృతి చెందింది. అయితే ఎస్ఐబి జనరల్ ఇన్సూరెన్స్‌లో 1000 రూపాయలు కట్టి వున్నారు. ఈ సందర్భంగా బాధితులు యాక్సిడెంట్ సంబంధించిన ఇన్సూరెన్స్ గురించి బ్యాంక్ వచ్చి మేనేజర్‌ని కలిశారు. వారి మేనేజర్ ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకోవడం గురించి పూర్తి వివరాలను తెలిపారు. మంగళవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్రాంచ్ నందు ఇరవై లక్షల రూపాయల చెక్కును ఎస్‌బిఐ మేనేజర్ ప్రద్యుమ్న, ఫీల్డ్ ఆఫీసర్ సిహెచ్ మురళీధరరావు, బ్యాంక్ సిబ్బంది చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు, భర్త అయినటువంటి నడిపింటి వినోద్‌కుమార్‌కి అందించారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజన్ ప్రద్యుమ్న మాట్లాడుతూ ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ క్లైమ్ రావడానికి సహకరించిన బ్యాంక్ మేనేజర్ ప్రద్యుమ్నకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# రైల్వే రెండో లైన్ పరిశీలనపై గ్రామ సభ



**ప్రజాపక్షిం/కారేపల్లి:** డోర్నకల్ టూ కొత్తగూడెం రైల్వే రెండో లైన్ పరిశీలించి రైతులకు, ఇండ్లు కోల్పోయిన వారికి సెంట్రల్ గవర్నమెంట్ ఆదేశాల ప్రకారం నష్టపరిహారం తెలియజేయడం కోసం మంగళవారం గ్రామ సభ ను నిర్వహించారు. ఈ గ్రామ సభలో భూములు పోయిన రైతులకి ఇల్లు కోల్పోయిన వారికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రైల్వే అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి, మండల రెవెన్యూ అధికారులు, బిజెపి రైల్వే బోర్డు నెంబర్, జిల్లా ఆఫీసర్ రాజేశ్వర్, సింగరేణి మండల తహసీల్దార్ సంపత్‌కుమార్, ఆర్ఐ నరసింహారావు, రైల్వే ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, రైల్వే బోర్డు నెంబర్ తురక నారాయణ, రైతు నాయకులు తోగారు శ్రీను, ముక్క వెంకటేశ్వర్లు, ముళ్ళ యాకాంబరం, గుండెబోయిన కోటేశ్వరరావు, కుమ్మరి రాజు, ఎస్‌కే అమీర్ పాషా, ఆగోళ్ల హరి, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీకాంత్ సంస్మరణ సభ

## -హాజరుకానున్న బివి రాఘవులు, తమ్మినేని తదితరులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, దివంగత నాయకుడు యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభ బుధవారం ఉదయం 9.30 గంటలకు త్రీటౌన్ బోసు బొమ్మసెంటర్‌లో జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్మరణ సభకు సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు ముఖ్య అతిథిగా హాజరు కానుండగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, బండారు రవికుమార్, సిహెచ్ బాబురావు, వై. విక్రం, కార్పొరేటర్ యర్రా గోపి,యర్రా శ్రీనివాస్, యర్రా రమేష్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి రండి



## వినూత్నంగా ఆడపడుచులకు బొట్టుపెట్టి పిలుపులు
## ఎంపి వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ





**ప్రజాపక్షం/ఖమ్మం :** సన్నాయి మేళం సప్పుళ్లు, బాజా భజంత్రీల మోతల నడుమ మహిళా నేతలు కుంకుమ పూలు, కుంకుమ, గంధం, వాయినాలు ఇవన్నీ పెళ్లి కార్యానికో అనుకుంటే పప్పులో కాలేసినట్టే.! ఈ హడావిడి ఎక్కడో తెలుసుకోవాలంటే.. ఈ వార్త పూర్తిగా చదవాల్సిందే..! ఈనెల 27న వరంగల్‌లో జరిగే భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రజతోత్సవ సభకు తరలి రావాలని వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. మేళ తాళాల నడుమ పార్టీ ముఖ్య నాయకులు ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి వరంగల్ సభకు ఆహ్వానించారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ తెలంగాణ ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్ అతిథులుగా హాజరై ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళా నేతలు, కౌన్సిలర్లు వెంట నడిచారు. ఇల్లెందు మున్సిపాలిటీ 7వవార్డులోని నెం2బ స్తీలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తల కుటుంబాల్లో ముఖ్యులైన బజారు సత్యనారాయణ, ఎం.ఎ.రవూఫ్, చాగర్ల సరళ, సామల రవితేజ ఇళ్లకు వెళ్లి బొట్టు పెట్టి కుటుంబసభ్యులందరినీ వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు హాజరుకావాలని ఎంపీ వద్దిరరాజు రవిచంద్ర కోరారు. ఒక ప్రాంతీయ పార్టీ పాతికేళ్లుగా క్రియాశీలకంగా ప్రజలకోసం అంకితమై పనిచేయడం చాలా అరుదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ తర్వాత అంతటి ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. అందుకే బీఆర్ఎస్ పాతికేళ్ల సంబురం పండుగలా నిర్వహిస్తామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఈ సభకు తాము ఊహించిన దానికంటే ఎక్కువమంది కార్యకర్తలు తరలివస్తున్నారని, సభను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మహబాద్ మాజీ జడ్పీటీసీ ఛైర్మన్ బిందు, మాజీ జడ్పీటీసి సంజీవ్, లక్కినేని సురేందర్, సిలివేరు సత్యనారాయణ, శీలం రమేశ్, నెమలి ధనలక్ష్మి, లలిత్‌పాసీ, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ దండు కదం తొక్కాలి.. కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి...



## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఈనెల27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి గులాబీ దండు కదం తొక్కాలి, కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ నాయక్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటైన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో హాజరై మాట్లాడారు. వరంగల్‌లో దాదాపు 10లక్షల మందితో జరిగే రజతోత్సవ సభలో బీఆర్ఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగి, వేసారి పోయారని ఆరోపించారు. ఆచరణలో సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి అమలుచేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. కేసీఆర్‌ను దూరం చేసుకుని ప్రజలు తప్పుపని చేశామని ప్రశ్చాత్తాప్పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేద్దామని భ్రమ పడుతున్న ముఖ్యమంత్రి తాను కూర్చున్న కుర్చీ కేసీఆర్ భిక్షే అని ఎద్దేవా చేశారు. అనంతరం భద్రాద్రి కొ్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు వరంగల్ సభకు దిశానిర్ధేశం చేశారు. సభకు హాజరయ్యే ముందు పార్టీ కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి బయలుదేరాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మహబాద్ జడ్పీ మాజీ ఛైర్మన్ ఆంగోత్ బింధు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్ నాయక్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు శీలం రమేశ్, బొమ్మెర ప్రసాద్, తాతా గణేశ్, లక్ష్మణ్ నాయక్, పరుచూరి వెంకకటేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు రంగనాథ్, జాఫర్ హుస్సేన్, జేకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారు..

## -మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య



**ప్రజాపక్షం/కల్లూరు :** కేసిఆర్ రైతులకు అండగా నిలిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దగాకోరు ప్రభుత్వంగా మారిందని ఆయన ఆరోపించారు. మంగళవారం కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజర, తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటవీరయ్య మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు రూ. 20వేల పరిహారాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందు చూపు లేకపోవడం కారణంగానే జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని వెంకటవీరయ్య ఆరోపించారు. ధాన్యం ఎగుమతికి బస్తాలు ఇవ్వకపోవడం, రవాణా సౌకర్యాలు లేకనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పుల్లయ్యబంజర్ కొనుగోలు కేంద్రంలోనే లక్ష బస్తాల ధాన్యం వర్షానికి తడిసిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒక ప్రత్యేకాధికారిని నియమించి ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలన్నారు. ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఈ జిల్లాకు ఉపయోగం లేదని వెంకటవీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామారావు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ ఛైర్మన్ మహేష్, నాయకులు బి. లక్ష్మణ్‌రావు, అజయ్‌కుమార్, లక్కినేని రఘు, వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు తపాల కార్యాలయంలో విద్యుత్, జనరేటర్ లేక ఆన్‌లైన్ అవస్థలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇల్లెందు తపాలకార్యాలయంలో దశాబ్దకాలంగా జనరేటర్ మరమ్మతులు, విద్యుత్ లేక ఆన్‌లైన్ సేవలు నిలుస్తుండటంతో పింఛనర్లు తీవ్ర అస్థలు పడుతున్నారని, తక్షణమే జనరేటర్ మరమ్మతులు చేయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నభీ డిమాండ్ చేశారు. మంగళవారం పాతబస్టాండ్‌లోని ఉదయం 9గంటల నుంచి 12:30గంటల వరకు విద్యులేకపోవడంతో తపాలాబ్యాంకు ఖాతాదారులు ఎండతీవ్రతకు, ఉక్కపోతకు మహిళలు పింఛనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని, విషయం పరిశీలించిన సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్‌నభీ మాట్లాడారు. ఏళ్లతరబడి జనరేటర్ మరమ్మతులకు గురైనప్పటికీ పట్టించుకోలేదని, ఈ విషయమై విద్యుత్ అధికారులతో, పోస్ట్‌మాస్టర్‌లతో మాట్లాడిన అనంతరం కరెంట్‌రాగా ఒంటి గంటకు ముగియాల్సిన పోస్టల్ బ్యాంకు సిబ్బంది ఎక్కువమంది ఉండటంతో తర్వాత కూడా సేవలందించినట్లు తెలిపారు.

# రాసురి శంకర్ మరణం కాంట్రాక్టు కార్మికులకు తీరని లోటు



**ప్రజాపక్షం/కొత్త గూడెం టౌన్ :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న క్రమంలో ఐక్య ఉద్యమాలకు సిఐటియు చేస్తున్న ఐక్య కార్యాచరణ కార్యక్రమాలలో రాసూరి శంకర్ యొక్క పాత్ర చెప్పుకోదగినదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిబి మధు అన్నారు. రా సూరి అకాల మరణం పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. రాసూరి శంకర్ భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హనుమాన్ బస్తి తన నివాసం నుండి అంతిమ యాత్ర లో పాల్గొనారు. ఈ కార్యక్రమం లో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్యా రమేష్, కాంటాక్ట్ కార్మికులు, పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం కూసుమంచి లో గల క్యాంపు కార్యాలయంలో76 మంది లబ్ధిదారులకు గాను 25 లక్షల పదివేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తాజా మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# భూ భారతితో రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం కు మంచి పేరు తీసుకరావాలని కాంగ్రెస్ నాయకులు తహశీల్దార్ కు వినతి పత్రం అందించారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వర్లు ను మర్యాపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కొత్త చట్టం పట్ల స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతుల కు అందుబాటులో ఉంటూ చట్టం ను అమలు చేసి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయుకులు జె క్రిపోతుల అంజిని, రావెళ్ల కృష్ణారావు, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు. యడవలి నాగరాజు కడియాల నరేష్, దోసపాటి శేఖర్. కటికోల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం గడువు పెంచాలి

**ప్రజాపక్షం/ఖమ్మం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకోవడానికి గడువును పెంచాలని, సీపీఐ కూసుమంచి మండల కార్యదర్శి భూక్యా నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకానికి పెద్ద మొత్తంలో దరఖాస్తులు రావడం వరుస సెలవులు రావడం తో సర్వర్ సమస్యలు తలెత్తాయి. దీంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈనెల 14 వరకు గడువు ప్రభుత్వం పెట్టడంతో నిరుద్యోగులు నష్టపోతున్నారని, మరల దరఖాస్తు గడువును పొడిగించి నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా దరఖాస్తులను ఆఫ్లైన్ పద్ధతిలో తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండెపంగు మల్లేష్, నాయకులు భూక్యా శ్రీకాంత్, పాండు రంగా చారి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.